క్లుప్తంగా

గన్నవరపు శ్రీనివాసరావు పరామర్శ



సుబ్బారావును పరామర్శిస్తున్న కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ కన్వీనర్ శీలం సుబ్బారావు మాతృమూర్తి సీతా మహలక్ష్మి ఇటీవల మృతి చెందారు. శనివారం వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్ పరామర్శించారు. సీతా మహలక్ష్మి మృతికి సంతాపం తెలిపారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరి వెంట గ్రామ శాఖ అధ్యక్షుడు పితాని శ్రీధర్, కొట్లాల శేఖర్ తదితరులు ఉన్నారు.

కాజ్‌వేపై రాకపోకలు ప్రారంభం

అయినవిల్లి: వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో ముక్తేశ్వరం- అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వేపై శనివారం రాకపోకలు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యాయి. వరద ముంపు వల్ల లంక గ్రామాల్లో తాగునీటి జలాలు కలుషితమయ్యాయని గ్రామస్తులు చెబుతున్నారు. తమకు రోగాలు ప్రభలే ప్రమాదం ఉందంటున్నారు. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ముక్తేశ్వరం వృద్ధ గౌతమి పాయలో వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. వృద్ధ గౌతమి స్మశాన వాటిక ఇంకా ముంపులోనే ఉంది. వరద ఇంకా తగ్గితే ఈ పరిస్థితి నుంచి విముక్తి లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు.

తగ్గుతున్న వరద



బూరుగులంక రేవులో పడవపై వస్తున్న లంక గ్రామాల ప్రజలు

పి.గన్నవరం: వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది గోదావరికి ఐదు సార్లు వరదలు రావడం, ఎక్కువ రోజులపాటు వరద ఉధృతి కొనసాగడంతో లంక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై రెండు అడుగుల ఎత్తున వరద ప్రవహిస్తోంది. దీంతో శనివారం వరద నీటిలో ఆ గ్రామ ప్రజలు రాకపోకలు సాగించారు. ఆదివారం ఉదయానికి కాజ్‌వే వరద ముంపు నుంచి బయటపడుతుంది. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, జిల్లా సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆగర్లంక, సిర్రావారి లంక గ్రామాల ప్రజలు ఇంకా పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రధానోపాధ్యాయురాలిగా ఉమ

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరు డాక్టర్ బొబ్బా జయ శ్రీబాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా కె.ఉమ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంలోని పిట్టల వేమవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఆమె బదిలీపై వచ్చారు. హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన ఉమను పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నేతలు అభినందించారు.

ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేత



పోతవరంలో ఆటో డ్రైవర్లకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

పి.గన్నవరం: ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గ స్థాయిలో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని పోతవరంలోని లేఅవుట్‌లో శనివారం ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో 1185 మంది ఆటో డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున మొత్తం రూ.1.75 కోట్లను వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్టు వివరించారు.

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



మలికిపురంలో ఆటో డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

మలికిపురం: రాష్ట్రంలో అభివృద్ధితో పాటు, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ప్రకటించిన రూ.1.29 కోట్లను మలికిపురంలో శనివారం ఆయన అందజేశారు.

జంక్షన్‌లో లైఫ్ టర్న్

- ఏటిగట్టు జంక్షన్ వద్ద ప్రమాదాల వెల్లువ
- రక్షణ గోడలను పట్టించుకోని ఆర్‌అండ్‌బీ శాఖ
- ప్రయాణించాలంటేనే హడలిపోతున్న ప్రజలు

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లేమి, అధికారుల నిర్లక్ష్యంతో 216ఏ జాతీయ రహదారిలోని జొన్నాడ నుంచి యానాం వెళ్లే ఏటిగట్టు రోడ్డు మీదుగా వెళ్లే ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. జాతీయ రహదారి నుంచి యానాం వైపు వెళ్లాలంటే ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని కొత్తపేట, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన యానాం వెళ్లేందుకు ఈ రోడ్డు అనువుగా ఉంటుంది. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు, ప్రయాణికులు రావులపాలెం మీదుగా జొన్నాడ ఏటిగట్టు నుంచి ఆలమూరు, కపిలేశ్వపురం, కోటిపల్లి మీదుగా సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న యానానికి అనునిత్యం వందలాది వాహనాల్లో వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. నాలుగు రోడ్లను కలిపే ఏటిగట్టు జంక్షన్ వద్ద హైవే అధికారులు కానీ, ఆర్‌అండ్‌బీ శాఖ కానీ సరైన చర్యలు తీసుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఏటిగట్టు జంక్షన్ వద్ద జాతీయ రహదారులకు ఇరువైపుల హెచ్చరికల బోర్డులు లేవు. అలాగే ఆ రెండు రోడ్లను కలిపే ఏటిగట్టు మధ్యలో రోడ్డు గుంతలమయంగా తయారైంది.

రెండు జాతీయ రహదారులను దాటి..

యానాం వైపునకు వెళ్లాలంటే 216ఏ జాతీయ రహదారిలోని రెండు రోడ్డులు దాటాలి. అయితే, యానాం రోడ్డు ప్రారంభం నుంచి కాలువ ఉండటంతో ముందస్తు జాగ్రత్త చర్యగా నిర్మించాల్సిన రక్షణ గోడల వ్యవస్థను ఆర్‌అండ్‌బీ శాఖ పూర్తిగా వదిలేసింది. దీంతో ఆ ఏటిగట్టు జంక్షన్ దాటి యానాం రోడ్డుకు వెళ్లాలంటేనే హడలెత్తే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. రావులపాలెం వైపునకు వెళ్లే రోడ్డును దాటేటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న వాహనం పంట కాలువలోకి వెళ్లిపోతుంది. యానాం రోడ్డు ప్రారంభంలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పలుమార్లు సూచిస్తున్నా.. పట్టించుకునే అధికారులు లేరనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇటీవల కాలంలో రాజమహేంద్రవరం వైపు నుంచి వస్తూ కపిలేశ్వరపురం వెళ్లేందుకు మలుపు తిరగబోతున్న వాహనదారుడు ఎదురుగా వస్తున్న సైక్లిస్టును తప్పించేందుకు సడన్ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న మహిళ అదుపుతప్పి పడిపోయి మృతి చెందింది. అలాగే రావులపాలెం వైపు నుంచి వస్తున్న వాహనదారుడు బైక్ అదుపు తప్పి నేరుగా 20 అడుగుల కింద ఉన్న పంట కాలువ గట్టు మీదుకు జారిపడి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఏటిగట్టు జంక్షన్ ప్రాంతంలో అను నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నా.. నష్ట నివారణ చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం విమర్శలకు తావిస్తుంది.

రోడ్డు అంతా ఎగుడు దిగుడే..

216ఏ జాతీయ రహదారిలో ఉన్న ఏటిగట్టు జంక్షన్ మధ్య ఉన్న సుమారు 30 మీటర్ల రోడ్డును సత్వరమే ఆధునీకరిస్తే ప్రమాదాలను నివారించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. గతంలో ఒకసారి ఆ రహదారిని అభివృద్ధి చేసినా ఆ ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్నాయనే నెపంతో అప్పట్లో ఆ రోడ్డును ధ్వంసం చేశారు, అయితే మళ్లీ ఆ రోడ్డు ఆవశ్యకతను గుర్తించి మళ్లీ రోడ్డును పునరుద్ధరించినా అభివృద్ధి చేయలేదు. దీని వల్ల ఆ రోడ్డు అంతా ఎగుడు దిగుడులుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. దీనిపై ఇకనైనా హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులు సత్వరమే స్పందించి ఏటిగట్టు జంక్షన్ ప్రమాదాల బారి నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

> **ప్రమాదాల నివారణకు చర్యలు**
>
> ఏటిగట్టు జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. రాబోయే పుష్కరాలకు సంబంధించి మంజూరు చేసే నిధులతో ఈ రోడ్డును అభివృద్ధి చేయనున్నాం. ప్రస్తుతం రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయనున్నాం. ఏటిగట్టు జంక్షన్ దిగువన ప్రమాదాల నివారణకు రిటైనింగ్ ఫెన్సింగ్ వేయడానికి అంచనాలు రూపొందిస్తాం.
>
> టి.సూర్యనారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ, రామచంద్రపురం.



ప్రమాదకరంగా జొన్నాడ- యానాం రోడ్డు జంక్షన్



రక్షణ గోడలు లేక తూర్పు డెల్టా ప్రధాన కాలువలో పడిపోయిన వాహనదారుడు (ఫైల్)



జొన్నాడ- యానాం రోడ్డు ప్రవేశం వద్ద కానరాని రక్షణ గోడలు

కూటమి మోసాలను గుర్తిస్తున్న ప్రజలు



అంకంపాలెంలో కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షులు జగ్గిరెడ్డి, అవినాష్

కొత్తపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ బాగోతాన్ని, మోసపూరిత పాలనను ప్రజలు గుర్తించారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న కమ్మ కళ్యాణ మండపం నిర్మాణ పనులను వారు శనివారం పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు గారపాటి గంగారామ్ చౌదరి తండ్రి గారపాటి అబ్బులు చౌదరిని ఆయన స్వగృహంలో కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ అభివృద్ధి, కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని వారు పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్త కరుటూరి నరేష్ దేవినేని అవినాష్‌కు ఆయన తండ్రి, మాజీ మంత్రి దేవినేని నెహ్రూ చిత్రపటాన్ని బహూకరించారు. ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాసరాజు, సర్పంచ్ పాల నాగేశ్వరరావు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం జాయింట్ సెక్రటరీ పల్నాటి శామ్యూల్‌రెడ్డి జయపాల్, కరుటూరి చిన్న తదితరులు పాల్గొన్నారు.

జగ్గిరెడ్డికి ఘన సత్కారం



చెముడులంకలో జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న తమ్మన కుటుంబీకులు

ఆలమూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి శనివారం ఘన సత్కారం జరిగింది. మండలంలోని చెముడులంకలో మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ తమ్మన సుబ్బలక్ష్మి దంపతుల గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు జగ్గిరెడ్డిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జగ్గిరెడ్డిని మండల కన్వీనర్ తమ్మన కుటుంబ సభ్యులు పూలమాలతో సత్కరించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, మాజీ ఏజీపీ నామాల శ్రీనివాసు, చల్లా వెంక సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన



సంధిపూడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ రాజేశ్వరరావు

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిని కలిగి ఉండాలంటే స్థానిక వనరులైన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట డీఎల్‌డీఓ రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని సంధిపూడి, నవాబుపేట గ్రామాల్లో ఎంపీడీఓ ఏ.రాజుతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు అవసరమైన మౌళిక వసతుల కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని సర్పంచ్‌లు తోట భవానీ, సూరంపూడి ముత్యాలమ్మ, గ్రామ కార్యదర్శులు వీర్రాజు, వి.హనుమకు హామీ ఇచ్చారు. చెత్త నుంచి తయారు చేసే జీవన ఎరువులపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. అలాగే గ్రామాల్లో ఉన్న స్మశాన వాటిక అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో ఉన్న స్మశాన వాటికలను పార్కుల మాదిరిగా తీర్చిదిద్దుతామని రాజేశ్వరరావు తెలిపారు.

శెట్టిబలిజ మండల అధ్యక్షుడిగా 'బొంతు'



రాజోలు: శెట్టిబలిజ సంఘ మండల అధ్యక్షుడిగా తాటిపాకకు చెందిన బొంతు రమేష్ నియమితులయ్యారు. శనివారం తాటిపాకలోని తాలూకా శెట్టిబలిజ సంఘ భవనంలో మండల సంఘ నూతన కార్యావర్గాన్ని నియమించారు. మండల అధ్యక్షుడిగా బొంతు రమేష్, ఉపాధ్యక్షుడిగా కాండ్రేగుల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా చెల్లింగి శ్రీను, కార్యదర్శిగా పితాని రాము, కోశాధికారిగా మామిడిశెట్టి సత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాలూకా అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల రాము, ఉపాధ్యక్షుడు బొక్కా ఏడుకొండలు, చిట్టూరి గణేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం



వాడపాలెంలో ప్రసాద్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే, యూనియన్ సభ్యులు

కొత్తపేట: గుండెపోటుతో మృతి చెందిన ఫొటోగ్రాఫర్ తటవర్తి సత్యప్రసాద్ కుటుంబానికి సహచర జిల్లా ఫొటోగ్రాఫర్స్ సంఘీభావంగా నిలిచారు. మానవత్వంతో రూ.లక్ష సాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. కొత్తపేటలో ఫొటోగ్రాఫర్‌గా, జిల్లా ఫొటోగ్రాఫర్స్ యూనియన్ పీఆర్‌ఓగా పని చేసిన సత్యప్రసాద్ ఈ ఏడాది ఏప్రిల్‌లో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి జిల్లా యేనియన్ రూ.లక్ష ప్రకటించింది. ఆ మేరకు శనివారం వాడపాలెంలో ఎమ్మెల్యే సత్యానందరావు చేతులు మీదుగా సత్యప్రసాద్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యక్తిగతంగా రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గెద్దం సురేష్ కుమార్, గౌరవాధ్యక్షుడు రామారెడ్డి, ఉపాధ్యక్షుడు మనోజ్, కార్యదర్శి దొరబాబు పాల్గొన్నారు.

భేతాళ ఉత్సవానికి సాంకేతిక బందోబస్తు

అంబాజీపేట: విజయదశమి అనంతరం అంబాజీపేటలో నిర్వహించే భేతాళ ఉత్సవానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బందోబస్తు చేపడుతున్నట్లు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ చెప్పారు. ఈ నెల 8న అంబాజీపేటలో జరిగే భేతాళ ఉత్సవం దృష్ట్యా స్థానిక పెద్దవీధిలో ఉన్న ఏవీఆర్ గ్రాండ్ మినీ కళ్యాణ మండపంలో భేతాళ ఉత్సవ నిర్వాహకులుతో సీఐ ఆర్.భీమరాజు అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. మురళీమోహన్ మాట్లాడుతూ, గత 58 ఏళ్ల నుంచి వైభవంగా జరుగుతున్న భేతాళ ఉత్సవాన్ని ఈ ఏడాది కూడా సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేటట్లు నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. భేతాళ ఉత్సవాన్ని డ్రోన్లతో పర్యవేక్షించేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు చెప్పారు. కొంతమంది యువకులు మద్యం సేవించి బైకులపై సైలెన్సర్లు తీసేసి త్రిబుల్ రైడింగ్ చేస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఉత్సవంలో ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల వద్ద యాంకర్లు ధరించే డ్రెస్ కోడ్ సాంప్రదాయబద్ధంగా ఉండాలన్నారు. సినీ, రాజకీయ కారణాలతో ఘర్షణలకు పాల్పడితే కార్యక్రమాన్ని నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మళ్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్ మాట్లాడుతూ, అశ్లీలతకు తావు లేకుండా కుల, మత బేధాలకతీతంగా భేతాళ ఉత్సవాన్ని నిర్వహించుకోవాలని సూచించారు.

భేతాళ ఉత్సవంపై ఐజీ ఆరా..

భారీగా జరిగే భేతాళ ఉత్సవంపై ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ ఆరా తీశారు. సమావేశం జరుగుతున్న సమయంలో మురళీమోహన్ ఉత్సవ నిర్వహణపై తీసుకునే చర్యలను ఐజీ వివరించారు.

ఐజీ స్పందిస్తూ ఉత్సవాన్ని సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించినట్లు మురళీమోహన్ సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో శెట్టిబలిజ అభ్యుదయ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి రామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం మోహనరావు ఆయా ఉత్సవ కమిటీ నిర్వహకులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల గ్రామోత్సవం



మడికిలో గ్రామోత్సవం నిర్వహించిన భక్తులు

ఆలమూరు: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గాదేవి ముగింపు ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. అమ్మ వారి విగ్రహాలకు భక్తులు భారీ ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ బాణసంచా కాల్పులు, తీన్మార్ వాయిద్యాలతో ప్రత్యేకంగా అలంకరించిన పూల పల్లకిపై అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయా దుర్గాదేవి మండపాల వద్ద నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

గొల్లపాలెంలో దసరా ఊరేగింపు

మలికిపురం: మండల పరిధిలోని గొల్లపాలెంలో శనివారం భక్తులు దసరా ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలు ముగింపు పురస్కరించుకొని బాణసంచా కాల్పులతో, సాంస్కృతిక కార్యక్రమాలతో అధిక సంఖ్యలో భక్తులు పై ఊరేగింపు ఏర్పాటు చేశారు.

ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా 'తెన్నేటి'



రాజోలు: ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జిగా చింతలపల్లికి చెందిన తెన్నేటి నగేష్ నియమితులయ్యారు. శనివారం రాజోలు జిల్లా ఇన్‌చార్జి మధు ఇన్‌చార్జి నియామకాన్ని ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలైన ఎమ్మెస్పీ, ఎమ్మెమ్మెస్, ఎంవైఎస్, వీహెచ్‌పీఎస్‌లకు నగేష్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారన్నారు. ఇంతవరకు రాజోలు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా, మలికిపురం మండల ఇన్‌చార్జిగా, జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రచార కార్యదర్శిగా నగేష్ బాధ్యతలు నిర్వహించారు. నగేష్ నియామకం పట్ల పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

శాటిలైట్ రోవర్స్ సహాయంతో భూముల రీసర్వే



భూముల రీసర్వేపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో శ్రీకర్ తదితరులు

అంబాజీపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల సరిహద్దులను నిర్దేశించేందుకు గ్రామంలో ఉన్న భూముల రీసర్వే నిర్వహించేందుకు శాటిలైట్ రోవర్స్‌ను వినియోగిస్తున్నట్లు కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్ చెప్పారు. మండలంలోని చిరతపూడి, కె.పెదపూడిలలో మూడో విడత భూముల రీసర్వేపై గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ బి.చినబాబు అధ్యక్షతన జరిగిన గ్రామ సభల్లో ఆర్డీఓ మాట్లాడుతూ, రీసర్వే విధానాన్ని గ్రామస్తులు, రైతులకు వివరించారు. ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్టైతే సంబంధిత వ్యక్తులు, రైతులు భూమి హక్కు పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకాల నకళ్లను, అడంగళ్ల కాపీలను స్థానిక సచివాలయాల్లో సమర్పించాలన్నారు. కార్యక్రమంలో మండల ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, చిరతపూడి, కె.పెదపూడి సర్పంచ్‌లు కోట బేబీ రాణి, బీర శాంతి, సర్వేయర్లు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'లిదియా పూలు సలామీ అఖాతం' పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్: న్యాయవాది, రచయిత బడుగు భాస్కర్ జోగేష్ రచించిన 'లిదియా పూలు సలామీ అఖాతం' కవితా సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమం స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో శనివారం నిర్వహించారు. అంబాజీపేటకు చెందిన కవి, రచయిత నామాడి శ్రీధర్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ పుస్తక రచయిత భాస్కర్ జోగేష్ తాను రాసిన కవిత్వంలో సౌందర్య దృష్టికి ఎంతటి ప్రాధాన్యత ఇచ్చారో వాస్తవికతను కూడా అంతే ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. సంపుటిలో బాల్యం, యవ్వన కాలాల జ్ఞాపకాలతోపాటు సామాజిక ఘటనలు, రాజకీయ పరిణామాలను చక్కగా వివరించారని రచయిత భాస్కర్ జోగేష్‌ను శ్రీధర్ ప్రశంసించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి అజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ ఆవిష్కరణ సభలో కవి భాస్కర్ జోగేష్ తల్లి ఈశ్వరమ్మ కవితా సంపుటి తొలి ప్రతిని స్వీకరించారు. కవి, సాహితీ విమర్శకులు సుంకర గోపాల్, కవులు, రచయితలు అవధానుల మణిబాబు, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, దాట్ల దేవదానం రాజు, కోడూరి రామరాజు, ఎమ్మెస్ సూర్యనారాయణ, మిరప మహేష్, మోకా రత్నరాజులు మాట్లాడుతూ కవి భాస్కర్ జోగేష్ కవితా వైభవాన్ని వివరించారు.

విద్యుత్ మీటర్ సమర్పణ

ఆలమూరు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రఖ్యాత గాంచిన నవ జనార్దనాలయాల్లో ప్రముఖమైన ఆలమూరులో ఉన్న జనార్దనస్వామి ఆలయానికి విద్యుత్ మీటర్ సమర్పించారు. మండపేటకు చెందిన ట్రాన్స్‌కో ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ కె.శ్రీధర్ ఆలయ ఆవరణలో భోజన శాల ప్రాంగణంలో ఆలయ కమిటీ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు సమక్షంలో ఆ మీటరును దేవదాయ శాఖకు అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి కంప్యూటర్ల సమర్పణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి శనివారం కేశవదాసుపాలెంకు చెందిన యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ సిబ్బంది రెండు కంప్యూటర్లు అందించారు. ఈ మేరకు వీటిని దేవస్థానం కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్‌కు సదరు బ్యాంకు మేనేజర్ యు.రవిబాబు అందజేశారు. బ్యాంకు సిబ్బంది, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య విద్యలో సోదరీమణులు

సఖినేటిపల్లి: వైద్య విద్యలో సోదరీమణులు రాణించడం పట్ల కుటుంబ సభ్యుల్లో సంతోషాలు వ్యక్తమయ్యాయి. మలికిపురం మండలం గూడపల్లికి చెందిన తరపట్ల సుభాషిణి 2021లో విశాఖపట్నం కేజీహెచ్‌లో విద్యనభ్యసించి, అక్కడే హౌస్ సర్జన్‌గా చేస్తున్నారు. ఈ క్రమంలో సుభాషిణి సోదరి రవీనా కూడా ఇటీవల నిర్వహించిన వైద్య విద్య ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మధురవాడలోని గాయత్రి మెడికల్ కాలేజీలో సీటు తాజాగా సాధించారు. ఈ మేరకు శనివారం మోరిలో రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల గౌరవ అధ్యక్షుడు ఓగూరి టాండన్‌రాజు రవీనాను సత్కరించారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు



విశేషాలంకరణలో నల్ల చెరువు వేంకటేశ్వరస్వామి

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో ఉన్న అలిమేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

బాలాజీ సన్నిధిలో ఐటీ సలహాదారు నాగబాబు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారిని రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య ఐటీ సలహాదారు పెన్నమరెడ్డి నాగబాబు శనివారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ దేవేరులతో కొలువై ఉన్న స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆయనకు ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.